# ఉభయభాషాప్రవీణ

– నిడదవోలు మాలతీ.

ఌఌ

ఒక్కొక్కప్పుడు ఆలోచిస్తుంటే, ఇంగ్లీషొక్కటే భాష కాబోలు అనిపిస్తుంది కొందరి తరహా చూస్తే. ఇంగ్లీషులా ధ్వనించని ఏ భాష మాటాడినా, తెల్లమొహం వేస్తారు అదేదో అవాచ్యం అన్నట్టు. రెండక్షరాల పేరు కూడా ధ్వంసం చేయగల జనాల్ని చూస్తే ఏఁవనాలో నాకు తోచదు.

అదే మన దేశంలో చూడండి. జనాభా లెక్కల్లో నిరాక్షరాస్యులుగా తేలేవాళ్లు కూడా రెండో మూడో భాషలు తడుముకోకుండా మాటాడేస్తారు. మీరిక్కడికొచ్చి ఎంతకాలం అయిందీ అనడక్కండి. బాలాప్రాయం వదిలేస్తే, నా జీవితం సరిగ్గా సగఁ పుట్టిన గడ్డమీదా, సగం మెట్టినగడ్డమీదాను. నేనిక్కడ అడుగెట్టగానే పాపం చాలామందే నన్నుద్ధరించడానికి పూనుకున్నారు కాని నేనే మొండికేశాను, నాపేరూ, మొహమూ, బాసా, యాసా మొత్తం అంతా ఏకైక పేకేజీ అంటూ. మీకు నచ్చకపోతే మీ ఖర్మ అని చెప్పేశాను…

అస్సిమిలేషను నా కార్యక్రమంలో లేదు. మెయిను స్ట్రీములో పడకుండా చాలా జాగ్రత్త పడ్డాను. పడ్డాననే అనుకున్నాను.  కాని నాప్రమేయం లేకుండానే జరిగిపోయింది, చాపకింద నీరులా ఇంగ్లీషు నామెదళ్లో కమ్ముకునేసింది. కొలొనియలిజంలాటిదే ఈ బైలింగ్విలిజం కూడా నన్నడిగితే. నేను తెలుగులో ఆలోచించడం ఎప్పుడు మానేశానో నాకే తెలీదు. ఇంగ్లీషులో ఆలోచించడం నా స్వయంకృతాపరాధం కాదు.

✧✧✧

నాలుగు నెలలకిందట మా పక్క వాటాలో ఓ కొత్త కుటుంబం దిగారు. ఆవిడా, ఆయనా, ఓ పదేళ్ల కుర్రాడూను. ఏదేశమో తెలీదు కాని ఈ దేశం ఆయోమయం అని అర్థం అవడానికి అట్టేకాలం పట్టలేదు నాకు.

వాళ్లు దిగిన వారం రోజులకనుకుంటాను. ఏదో పుస్తకం పట్టుక్కూచున్నాను. తలుపు తట్టిన చప్పుడు విని లేచి, తలుపు తీశాను. మా పక్క వాటాలో ఆవిడ.  హాయ్, అన్నాను ఆహ్వానపూర్వకంగా, ఓ అడుగు వెనక్కేసి. ఆవిడ మొహంలో భయం. నా చెయ్యి పుచ్చుకు గుమ్మం అవతలికి లాగి, ఎదురుగా కనుచూపు దూరంలో ఉన్న ఇల్లు చూపింది. ఆ ఇంటి చిమ్నీలోంచి పొగ వస్తూంది. నాకు నవ్వొచ్చింది. ప్రమాదమేమీ లేదని చెప్పబోయాను. అప్పుడు తెలిసింది, ఆవిడకి ఇంగ్లీషు రాదని. రకరకాల హావభావాలతో ఓ పావుగంట పాటుపడి, అనునయించి పంపించేశాను.

అ తరవాత ఓ వారం రోజులపాటు, కారు ఎక్కుతున్నప్పుడూ దిగుతున్నప్పుడూ కనిపించేది.

✧✧✧

వాళ్ల అబ్బాయిని స్కూల్లో వేశారు.  తల్లిదండ్రులకి ఇంగ్లీషు రాదు కనక నన్ను వాళ్లతో రమ్మన్నారు. అక్కడ కాయితాలన్నీ నేనే పూర్తి చేశాను నాకు తోచినట్టు. చివర సంతకాలు పెట్టవలసిన చోటు చూపించి సంతకాలు పెట్టమన్నాను. తండ్రి వాళ్లభాషలోనే అతని పేరు గిలికాడు. అదేమిటో ఎవరికీ తేలీదు కనక నన్ను సాక్షి సంతకం పెట్టమన్నారు ప్రిన్స్‌పాలుగారు. సరే  నాపేరు కూడా జతపరిచాను. వారు సంతకాలు పెట్టిందెందుకో వారికి తెలీదు. అది విడమరిచి చెప్పే భాషాపాటవం నాకు లేదు. అది గమనించనట్టుగా, ఆరోజు నేనూ, ప్రిన్స్‌పాలు గారూ కూడా మన సిస్టమును పరిరక్షించి సంతృప్తి చెందాం!

ఫ్రిబుయెమేని అందరం క్లాసుకి నడిపించుకెళ్లాం. టీచరు యెసీనా ఎంతోఅనునయంతో, ఫ్రిబుయెమేని క్లాసులోకి నడిపించుకెళ్లి, పిల్లలందరికీ పరిచయం చేయబోయింది, ‘‘క్లాస్, మరో కొత్త అబ్బాయి మనక్లాస్‌లో’’ అని, అతనివేపు తిరిగి పేరడిగింది. ఆకుర్రాడు మాటాడలేదు. ప్రిన్స్‌పాలుగారు అంతకుముందు చెప్పారు కాని ఆవిడకి పట్టుబడలేదు. రెండోమారు కూడా అడిగి, జవాబు రాక, ‘‘ఫిల్ అంటాం, ఏం?’’ అని అతనికీ, క్లాసుకీ కూడా విదితం చేసింది. కుర్రాడికి ఇదంతా అయోమయంగా ఉందో, అవమానంగా ఉందో, పళ్లు గిట్టకరచి మాటాడకుండా చూస్తున్నాడు అందర్నీ. క్లాసంతా ముక్తకంఠంతో, ‘‘హాయ్, ఫిల్,’’ అన్నారు.

అలా అతడి నామకరణం, స్కూల్లోవేయడం అయేక, మేం ఇల్లు చేరుకున్నాం. అదృష్టవశాత్తు స్కూలు అట్టే దూరం లేదు. గట్టిగా అడుగులేస్తే పదినిముషాలు, అంతే.

మర్నాడు స్కూలుకెళ్లడానికి పేచీ పెట్టినట్టున్నాడు. మళ్లీ నాతలుపు తట్టారు పొద్దున్నే. నేను మాత్రం ఏం చెప్పగలను? వాళ్లభాష నాకు రాదు, నా మాటలు వాళ్లికి అర్థం కావు! వాళ్లు రకరకాలుగా చేతులూపుతూనూ, ముఖకవళికలతోనూ నాకు వివరిస్తున్నారు. నేను చిదానందసాములారిలా మొహం పెట్టుకు వింటున్నాను, కాని ఈ వీధిభాగోతం ఎంతసేపు? అవతల నాకు వేళయిపోతోంది. ఆకుర్రాడి చెయిపుచ్చుకు, నాకారు చూపించాను, ‘‘లెటస్గో’’ అంటూ. ఏం అనుకున్నాడో, మాటాడకుండా, వచ్చి కారులో కూచున్నాడు.

నేను వాళ్లని గురించి ఆలోచిస్తున్నాను. తండ్రి గాస్‌స్టేషనులో పని చేస్తున్నాడు. తల్లి మాచుట్టపక్కల నాలుగిళ్ల క్లీనింగ్‌లేడీ. 1970లనాటి పాతకారు ఒకటి కొన్నారు 500 డాలర్లకి. ఆకారుకి, కొత్తబాటరీ కావాలి, టైర్లు కావాలి, కార్బురేటరు కావాలి.

నెలరోజుల తరవాత, ఓసాయంకాలం ఊరుకోలేక వాళ్లింటికెళ్లాను, ఏం చేస్తున్నారో చూద్దాం అనిపించి. నన్ను చూడగానే ఆవిడ మొహం మతాబాలా వెలిగింది లిప్తపాటు.  ఏవేవో వస్తువులు, వాళ్లదేశంనించి తెచ్చుకున్నవి

చూపిస్తూ చెప్తోంది. నాలుగు ఇంగ్లీషు ముక్కలు కూడా పట్టుబడ్డాయి. చురుకైనవాళ్లే అయిఉండాలి. తమదేశంలో ఇంజినీరుగా పనిచేసేదిట. ఇదా వాళ్ల అమెరికన్ డ్రీం అనిపించి, నాప్రాణం ఉసూరుమంది.
ఇంటికొచ్చేసరికి, ఎనిమిదవుతోంది. గోపు ఎదురుచూస్తున్నాడు నాకోసం. కాలేజీలో మొదటి ఏడు చదువుతున్నాడు. నావెనక పదేళ్లకి పుట్టేడు కానీ అభిప్రాయాల్లో నేను ఒక తరం వెనకుంటే వాడు రెండు తరాలు ముందున్నాడు, వెరసి మూడుతరాల అంతరం మామధ్య. పట్నంలో ఇంగ్లీష్‌మీడియం స్కూల్లో చదువు వెలిగించి, అమెరికాకి వచ్చాడు. అమరికన్‌యాస కూడా అక్కడే నేర్చేసుకు వచ్చాడు. యతావాతా చెప్పొచ్చేదేమిటంటే ఇంగ్లీషుయాసతో తెలుగు మాటాడే బోర్డర్‌లైన్ బైలింగ్వల్!
''ఎక్కడున్నావు ఇంతసేపూ'' అన్నాడు నన్ను చూడగానే. వాడు కాలేజీనించి ఇంటికొచ్చేసరికి, సాధారణంగా నేను వంట పూర్తిచేసి, టీవీ చూస్తూనో, పుస్తకం పట్టుకునో ఎదురవుతాను మరి.
''పొరిగింటికెళ్లాను, పిచ్చాపాటీ మాటాడ్డానికి ఆవిడతో,'' అన్నాను.
వాడు నవ్వేడు. ''ఏంవిటి మాటాడేరు ఇద్దరూ రెండు గంటలసేపు? ఆవిడ భాష నీకు రాదు, నీ మాట ఆవిడకి తెలీదు.''.
''ఏం, ఇక్కడ జనాలు కుక్కలతోనూ, మొక్కలతోనూ ఊసులాడతారు. ఆమాత్రం చెయ్యదా సాటి మనిషి,'' అన్నాను విసుగ్గా.
ఫిల్ ఇంచుమించు రోజూ పేచి పడుతున్నాడు స్కూలికెళ్లడానికి. ఒకరోజు కమిలిన మొహంతో వచ్చాడు. మరో రోజు ముక్కులోంచి రక్తం కారుకుంటూ, మూడోరోజు కుంటుకుంటూ.
వారంరోజులనాడు, యెసీనా ఇంటికి వచ్చింది. ఆవిడ ఫిల్ తల్లిదండ్రులతో మాటాడాలని వచ్చింది కాని సాధించిందేమీ లేదని సుళువుగానే అర్థం అయింది నాకు. ఆవిడ మంచి టీచరే. నిజంగా పిల్లలంటే చాలా అభిమానం. వాళ్లకి చదువు చెప్పాలని బోలెడు తాపత్రయం. అందిన పుస్తకంవల్లా చదువుతుంది. వర్క్‌షాపులకి వెళ్తుంది. ఇంగ్లీషు రెండోభాషగా బోధించే కాన్ఫరెన్సులకెళ్తుంది. ఆవిడ తిండీ, నిద్రా, కలలూ కూడా ఈయస్సెలే! ఫిల్‌కి ఇంగ్లీషు నేర్పడం ఆవిడకొక పరీక్షగా తయారైంది. అందులో ఫెయిలయితే ఆవిడకి మహా అవమానం. అటువంటి పరాజయం ఆమెగారు భరించలేరు. ఆకుర్రాడిని స్కూలయింపోయింతరవాత కూర్చోబెట్టి రకరకాల పద్ధతులలో భాష నేర్పడానికి ప్రయత్నించింది. అలా ఆవిడ తనకొక ప్రత్యేకత ఇవ్వడం అతనికి బాగానేవుంది. ఆవిడతో కాలక్షేపం చేయడానికి ఆపిల్లాడికేం అభ్యంతరం లేదు కాని నోట మరోభాష పలకడం మాత్రం మహా సంకటంగా ఉంది రోజుకి రోజూ. ఏరోజు చూసినా ఫిల్ కళ్లలో బాధ కొట్టొచ్చినట్టు కనిపిస్తూ నన్ను కలవర పెడుతోంది.

ఆఖరికి ఆరోజు కూడా వచ్చింది. వాడిని స్కూల్లోంచి తగిలెయ్యడానికి సిద్ధం అయేరు ప్రిన్స్‌పాలు గారు. యెసీనా పిల్లవాడి తల్లిదండ్రులతో మరోసారి చెప్పి చూస్తానని ఆయనకి నచ్చచెప్పి, వచ్చింది. కుర్రాడు మేకలు

నరుక్కునే కత్తి తీసుకువెళ్లాడట క్లాసుకి! యెనీనా వచ్చేవేళకి నేను ఇంట్లోనే ఉన్నాను. నేను ఉండేలా చూసుకునే వచ్చిందావిడ. నాకు వివరంగా అక్కడ జరుగుతున్న విషయాలు చెప్పి పిల్లాడిని ఎలాగైనా కాపాడమని వేడుకుంది. తెలివైన వాడంది. వాడిని బాగుచెయ్యడమే తన ధ్యేయం అంది. ఇంగ్లీషు నేర్చుకున్నందువల్ల కలిగే లాభాలు, నేర్చుకోకపోతే వచ్చే నష్టాలూ, కష్టాలూ, తను పడుతున్న అవస్థలూ చక్కా వివరించింది. అతడి దేశం సంస్క ృతీ, ఆచారాలూ, పండుగలూ, దేవతలూ, పిండివంటలూ మొదలైన విషయాలు సేకరించి ఫ్లాష్‌కార్డులు తయారు చేశానని చెప్పింది. ఎంత చేసినా ఫిల్ ఏమాత్రం ఉత్సాహం చూపడం లేదుట. ఓపినంతసేపు విన్నాను నేను. స్పష్టంగా చెప్పలేను కాని ఫిల్ ప్రవర్తన నాకెందుకో విపరీతంగా తోచలేదు.
''కుర్రాడికి కొంచెం టైమివ్వండి,'' అన్నాను మరేం తోచక.
దాంతో ఆవిడ మళ్లీ అందుకుంది. ఈసారి ఆవిడ కోర్సు కంటెంటు స్థానిక ఆచారాలూ, వ్యవహారాలూను. ఇక్కడి సినిమాలూ, సంగీతం, హిప్‌హాప్, జాతీయనాయకులూ, సంబరాలూను--ఫిల్‌కి ఇవీ పట్టలేదు. చిన్నపిల్లల సింగ్‌ఎలాంగ్ కాసెట్స్ ఇచ్చింది వాడికి. వాడు మరీ అంత పసిపిల్లాడు కాదని తోచలేదావిడకి. ఆమాట వాడు అనలేదు కాని వాడి మొహం చెబుతోంది.
యెనీనా ఉభయభాషాప్రావీణ్యం వల్ల లభించే ఆనందం, సౌభాగ్యం గురించి ఉపన్యసిస్తోంది. ఆఖరి అస్త్రంగా, ''మీరు ఇంట్లో మీ భాష మాటాడకండి. ఇంగ్లీషే మాటాడాలని కట్టడి చెయ్యండి,'' అంది.
వెనువెంటనే ఒక హ్రీంకారంతో గది ప్రతిధ్వనించింది. ''.. ..'' ఫిబుయమే అరిచాడు వంట్లో ఉన్న శక్తినంతటినీ కూడగట్టుకుని. అతడు పలికిన వాక్యం శిష్టజనవ్యావహారికం కాదు కనక ఇక్కడ రాయలేను. అందరం నిర్ఘాంతపోయేం క్షణకాలంపాటు. తరవాత ఒకరిమొహాలు ఒకరం చూసుకున్నాం. కుర్రాడి తండ్రి ఏదో అరిచాడు, బహుశా మాటలు తిన్నగా రానియ్‌లాటి వాచకం కావచ్చు.
''ఇంగ్లీషు రాలేదన్నారు. అదుగో ఇంగ్లీషు,'' అన్నాను నేను. అలా అనడం మర్యాద కాదని నాకు తెలుసు. నా అభిప్రాయం--పిల్లలు మనం అనుకున్నదానికంటె వేగంగానే భాష నేర్చుకోగలరనీ, మనం అనుకోని పద్ధతులలో నేర్చుకుంటారనీను.
''అది నేను నేర్పినమాట కాదు,'' అంది యెనీనా పాలిపోయిన మోముతో, నీరసంగా.
మళ్లీ తన మొదటి థియరీకొచ్చింది. తల్లిదండ్రులు కూడా ఇంగ్లీషు నేర్చుకోవలసిన అవుసరం ఉంది కనక అందరూ ఇంట్లో ఇంగ్లీషే మాటాడడం సమంజసం అని నొక్కి వక్కాణించింది. నాకు ప్రాణం చాలుకొస్తోంది.
''మీరు వాళ్లకి నచ్చ చెప్పండి. వాళ్లు ఈదేశంలో బతకడానికి భాష అవుసరం.'' ఆవిడకి కూడా ఓర్పు నశిస్తోంది.
నేను తెలివిగా తప్పుకున్నాను, ''అదంతా చెప్పడానికి కావలసిన భాషాపాటవం నాకు లేదు,'' అన్నాను. అంతకు మించితే, నేను మాట తూలగలను, అప్పుడు నా భాష ఆవిడకి శ్రవణానందం కాకపోవచ్చు.
''కాని మీరు వాళ్లతో మాటాడుతున్నారు కదా!''

దాంతో నాకు అరికాలి మంట నెత్తికెక్కింది. ''నేనీమాట అంటే బాగుండదని ఇంతసేపూ ఊరుకున్నాను.  భాష సంస్కృతిలో భాగం. చాలా ముఖ్యమైన భాగం.  ఈ దౌర్భాగ్యపునేలమీద వాళ్లకి, మేమూ మనుషులమే అనుకోడానికి భాష కావాలి. ఆభాషకి ఇల్లొక్కటే గతి. ఆఇంట ఆమాత్రం స్వేచ్ఛ వాళ్లకి అవుసరం. మీరు ఇంట్లో కూడా ఇంగ్లీషే మాటాడాలని ఆంక్ష పెడితే ఏంచెప్పను? మీరు వాడిని ఉభయభాషా ప్రవీణుడిగా కాదు, కేవలమూ ఇంగ్లీషే మటాడే ఏకభాషాజీవిగా చేస్తున్నారు,'' అన్నాను. అనేసి, నాకు పనుందని చెప్పి అక్కడ్నుంచి బయట పడ్డాను.

ఇంటికొచ్చానే కాని మనసంతా మహ చిరాగ్గా ఉంది. అన్నం అడుగంటింది. కూర ఉప్పు కషాయం. పులుసు చిక్కని వార్నిష్‌లా తయారైంది.

''ఏమైంది?'' అనడిగాడు గోపు, ఫ్రిజ్‌లోంచి టీవీ డిన్నరు తీసి, మైక్రోవేవ్‌లో పెట్టుకుంటూ.

''ఆపంతులమ్మ వాడిని ఉభయభాషాప్రవీణుడిని చేస్తుందిట.''

''అయితే తప్పేమిటి?''

''ఆవిడ వాడికి రెండు భాషలు నేర్పడం లేదు. వాడి కల్చరు నాశనం చేస్తూంది. నీకూ, నాకూ, ఆ పుట్టించినవాడికీ కూడా తెలుసు. ఇక్కడ ఉన్నాక, ఇంగ్లీషురాక చస్తుందా? తల్లిభాష మరచిపొమ్మని ఆవిడ పనిగట్టుకు చెప్పాలా?''

''అలా అంటున్నావు కాని నీకూ తెలుసు అది నిజంకాదని,'' అన్నాడు, కల్చరు నాశనం అవుతూందన్న మాటని గూర్చి.

మళ్లీ అందుకున్నాను, ''నిన్న మాఆఫీసులో ఎమిలీ నాకో వ్యాసం చూపించి నా అభిప్రాయం అడిగింది. ఎక్కడో పెన్సిల్వేనియాలో ప్రొఫెసరొకాయన రాశాడు, వసుధైకకుటుంబానికి ప్రాతిపదిక అందరూ ఒకేమూసలో పోసినట్టు ఒక్కలా ఆలోచించాలనీ, దానికి ప్రాతిపదిక లోకంలో విజ్ఞానం అంతా అందరూ పంచుకోవాలనీ.''

''నీకు అదీ తప్పుగానే తోచిందా?'' అన్నాడు గోపు నన్ను ఎత్తిపొడుస్తూ.

''లేదు. ఆతరవాత వాక్యమే శివాలెత్తించింది. ఏమన్నాడు తెల్సా? ఈఅధమతరగతి దేశాలన్నీ తమకున్న పుంజీడు పుస్తకాలూ కంఠస్తం చేసి, వల్లె వేసుకుంటూ అజ్ఞానతిమిరంలో కొట్టుకుంటున్నారూ, వాళ్లకి మనం, పుస్తకాలూ, కంప్యూటర్లూ, విడియోగేములూ ఇచ్చి, మన ఫుట్‌బాలూ, బేస్‌బాలూ, చదరంగంలాటి ఆటలు నేర్పి, వాళ్లని విజ్ఞానవంతులని చేయాలి అని.''

''చదరంగం కూడా ఆయనే కనిపెట్టేనంటాడేమిటి?'' అన్నాడు గోపు. అప్పటికి తోచింది వాడికి అవతలివాడి వాదనలో అవకతవకలు.

''అదే మరి. పుస్తకాలు లేకుండా జ్ఞానం సంపాదించొచ్చని అతనికి తట్టలేదు. ఆమధ్య ఓ కుర్రాడు ఉద్యోగానికి అప్లికేషనులో తనకి తెలుగు వచ్చునని రాసుకున్నాడు. ఏమాత్రం వచ్చో నన్ను పరీక్ష చెయ్యమన్నారు. తీరా అడిగితే నోట్లోంచి ఒక్కముక్క కూడా ఊడిపడలేదు. మాక్లాసులో చెప్పిందంతా పుస్తకంలో ఉంది, పుస్తకం

ఇంట్లో ఉంది అన్నాడు.'' హా అనేసి నాగదిలోకి వెళ్లిపోయాను. గోపు నామానానికి నన్ను వదిలేశాడు, ఆసమయంలో అదే క్షేమమని.

✧✧✧

కిటికీలోంచి చూస్తున్నాను. పొరుగింటి కుఱ్ఱాడు మా ఇంటిముందు కొంచెం ఎడంగా తచ్చాడుతున్నాడు. నాలుగు నిముషాలయింతరవాత, గోపు బాస్కెట్‌బాల్ తీసుకుని బయటికొచ్చాడు. ఓరెండుసార్లు బంతి హూప్‌లోకి విసిరేక, ఫిల్‌ని పిలిచాడు. ఫిల్ దానికోసమే ఎదురు చూస్తున్నట్టు, ఎగిరి బంతి అందుకున్నాడు. చురుకైన కుఱ్ఱాడే. బంతి సునాయాసంగా హూప్‌లోకి విసుర్తున్నాడు. వారిద్దరిమధ్య పెద్ద సంభాషణలేం లేవు. మధ్య మధ్యలో గోపు విసిరే వవౌ, గుడ్‌లాటి ఊతపదాలు తప్పిస్తే. మనిషికీ మనిషికీ మధ్య కలిగే స్పందన తప్పిస్తే.

గోపుకి నాఅవస్థ అర్థం కాదు. వాడికి చాలా సులభంగా వచ్చేసింది ఈ జోడుగుఱ్ఱాలస్వారీ. ఇక్కడ అడుగెట్టకముందే ఇక్కడి వ్యవహారాలు కరతలామలకం చేసేసుకున్నాడు సవ్యసాచిలా. మనదేశంలో ఇంగ్లీషు మీడియం స్కూల్లో తెలుగు పలికినప్పుడల్లా చీవాట్లు తింటూ, ఫైనులు కట్టుకుంటూ పాండిత్యం సాధించేశాడు, కాని, ఎంత చెడ్డా దేశంలో ఉంటే ఎక్కడో అక్కడ తెలుగు వినిపిస్తూనే ఉంటుంది. అంచేత వాడి తెలుగు ఫిల్ ఇంగ్లీషుకన్నా చూపువాసి మెరుగు.
నాబాధ--పరాయిగడ్డన బతుకు సాగించుకుంటున్నప్పుడు, భాషే సంస్కృతి. ఇల్లొక్కటే అది నిలబడగల ప్రదేశం--తమమట్టి కానిచోట తమ అస్తిత్వాలని నిలుపుకోడానికి ఆఖరి మజిలీ. కిటికీలోంచి చూస్తున్నాను. గోపూ, ఫిబుయమే తమ ఉనికి మరిచి ఆడుకుంటున్నారు. దేశం, భాష, రంగు, నమ్మకాలు, ఆచారాలు--ఏవీ వారికి స్పృహ ఉన్నట్టు లేదు. కేవలం ఇద్దరు పిల్లలు--అంతే!
నా మనసు అట్టడుగు అగాధాల్లోకి జారిపోతోంది. వీళ్లిద్దరూ అమెరికన్ బంగారం పండించుకుంటారు. అందుకు సందేహం లేదు. ఉభయభాషా ప్రవీణులు గూడా అవుతారు– కనీసం కడుపు మండినప్పుడు!

✧✧✧

(సెప్టెంబరు 2002లో బైలింగ్వల్ కిడ్ అన్న శీర్షికతో నా వెబ్‌సైట్, తూలికలో ప్రచురింపబడింది.)

‘‘ ’’